విద్యాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్‌నాథ్‌రెడ్డి
- ఇంటిగ్రేటెడ్ గురుకుల భవన నిర్మాణ పనులకు భూమిపూజ

సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 11: విద్యా వ్యవస్థను మెరుగుపరచి నాణ్యమైన విద్యను అందించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో యువ భారత్ సమీకృత గురుకుల భవన నిర్మాణ పనులకు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను బోధించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పాత కొడంగల్‌లో ఇప్పటికే ఎస్టీ గురుకుల పాఠశాల కొనసాగుతుందని, అదే ప్రదేశంలో ప్రస్తుతం ఒకే ఆవరణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలలను మొత్తం 20 ఎకరాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇంటర్మీడియట్‌తో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీలతో పాటు క్రీడలకు ప్రోత్సాహకరంగా ఉండేలా గ్రౌండ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దసరా తర్వాత అన్ని పాఠశాలల్లోకి ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, ఐఐ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, డీఎస్పీ మల్లేశం, డీటీడబ్ల్యూవో హన్మంతరావు, బీసీడబ్ల్యూవో ఉపేందర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాం నాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు, ఆయుధాలకు ప్రత్యేక పూజలు

ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 11: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకొంటున్నామన్నారు. చేసే ప్రతి పనిలో జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి విజయం వరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీస్ శాఖ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. అందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ధారూరు, అక్టోబరు 11: ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకులు సందడి చేశారు. విద్యార్థులకు సెలవులు కావడంతో శుక్రవారం కుటుంబ సమేతంగా ప్రాజెక్టుకు వచ్చి బోటింగ్ చేశారు. వారాంతపు సెలవు దినాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. పర్యాటకులు ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడుపుతారు. ఇందు కోసం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. బోటింగ్‌కు ముందు పర్యాటకులకు రక్షణగా దుస్తులు వేసి అనుమతి ఇస్తారు. వీటితో పాటు ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలి వస్తారు. వర్షాలు తక్కువగా ఉండడంతో పర్యాటకుల సంఖ్య చాలా పెరిగింది. ఉదయం ప్రాజెక్టుకు చేరుకొని సాయంత్రం వరకు ఇక్కడే ఉండి కుటుంబ సమేతంగా వచ్చి వన భోజనాలు చేస్తుంటారు. ప్రాజెక్టు నీటిలో ఫొటోలు సెల్ఫీలు తీసుకున్నారు.

ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు

బోటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు

సహకార సంఘాల బలోపేతానికి కృషి

కందుకూరు, అక్టోబర్ 11: జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి సుదాకర్ తెలిపారు. సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డితో కలిసి సహకార సంఘాన్ని సందర్శించారు. చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ వారిని కార్యాలయంలో శాలువాలతో సన్మానించిన అనంతరం కార్యాలయంలో రికార్డులను, పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో రైతుల వద్ద వరి ధాన్యాన్ని కోనుగోలు చేయాలని, అందుకోసం పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, డైరెక్టరు పొట్టి ఆనంద్, సీఈవో నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది మహేశ్, శంకరి పర్వతాలు, మంచాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం కావొద్దు..!

సేఫ్ జర్నీకి జాగ్రత్తలు తప్పనిసరి

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగకు ఊరెళ్తున్నారా ? ఓ పక్క ఆర్టీసీ బస్సులు రద్దీ.. మరోపక్క రైళ్లు కిటకిట.. ఇంకో వైపు ట్రావెల్స్ భారీ వసూళ్లు.. వీటి మధ్య సొంత వాహనంలోనే హాయిగా ప్రయాణించడం మేలు అనుకొని నగరవాసులు తమ సొంతూళ్లకు బయలుదేరుతుంటారు. ప్రయాణించాల్సిన దూరం, మార్గంపై ముందస్తు ప్రణాళిక వేసుకుంటే ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా, హాయిగా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాహన పరిమితికి సరిపడా ఎంతమంది వెళ్లొచ్చో..అంతే మంది ప్రయాణిస్తే ఎలాంటి సమస్యలు ఎదురుకావని సూచిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. సీటుబెల్ట్, హెల్మెట్లు ప్రాణ రక్షకులు అని తప్పకుండా వాటిని ధరించాలని చెబుతున్నారు. మరోవైపు వాహన సంఘాలు సైతం సెల్ఫీ విత్ సీట్ బెల్ట్ కార్యక్రమంపై ప్రచారం చేస్తున్నాయి.

ఈ సూచనలు పాటించండి..

- గమ్యాన్ని ఏ మార్గంలో చేరుకోవచ్చనే విషయంపై అవగాహన పెంచుకోవాలి. మార్గ సూచికలు ఉన్నా.. సరే ప్రత్యామ్నాయ ప్రయత్నాలు విరమించుకుంటే మంచిది. ప్రమాద జోన్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలి. రోడ్డుకు ఎడమ వైపు ఏర్పాటు చేసే బ్లాక్ స్పాట్ సూచికలను గమనిస్తూ ఉండాలి.
- రాత్రివేళల్లో ప్రయాణం చేయాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు సాధారణ వేగంలోనే ఉండాలి. ఏకధాటిగా వాహనాలు నడపకుండా మధ్యలో కొంత విశ్రాంతి తీసుకోవడం మంచిది. నిద్రకు దూరంగా ఉన్నవారిని ముందు సీట్లలో కూర్చోబెట్టాలి. రాత్రివేళ ఎక్కువగా జరిగే ప్రమాదాలు ఆగి ఉన్న వాహనాలే కారణమవుతున్నాయి. ఎక్కడైనా మన వాహనాలను నిలపాల్సి వస్తే ఇండికేటర్లు ఆన్ చేసి ఉండటం శ్రేయస్కరం.
- ప్రయాణంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి. స్టెప్నీ తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ప్రయాణం మధ్యలో వాహనం బ్రేక్‌డౌన్, ఇతర రిపేర్లు ఎదురైతే కారు ఏ కంపెనీయో దానిని బట్టి టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఆ టీం మీకు 3-4 గంటల్లోపు అందుబాటులోకి వస్తుంది. వివిధ కస్టమర్ల సేవా కేంద్రాల నంబర్లను మీ దగ్గర ఉంచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్ వెంట పెట్టుకోవడం మంచిది.

మీరెత్తుకున్న రాగమేంటి.. చేస్తున్నదేంటి?

మేయర్ విజయలక్ష్మి తీరుపై విమర్శలు

బతుకమ్మ ఈవెంట్‌లో డీజే మోత.. కత్తి ఎత్తి చూపిన మేయర్

డీజే బ్యాన్‌పై పోలీసు శాఖకు విజయలక్ష్మి సవాల్

సామాన్యులకో న్యాయం.. మీకో న్యాయమా..?

బతుకమ్మ వేడుకలో కత్తి ఎత్తి చూపుతున్న మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): మీరు ఎత్తుకున్న రాగమేంటి..? చేస్తున్న పనేంటి..? ఇది గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి తీరుపై గ్రేటర్‌వాసులతో పాటు నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. డీజే బ్యాన్ చేస్తున్నామంటూ మీ ప్రభుత్వమే ప్రకటనలు చేస్తుంది! పోలీసులు సామాన్యుల డీజేల దగ్గర చాలా స్ట్రిక్ట్‌గా నిబంధనలు అమలు చేస్తున్నారు. కానీ, మేయర్ పాల్గొన్న వేడుకలో బాజాప్పుగా డీజే మోతలు మోగించడం వెనక ఆంతర్యమేంటి? సామాన్యుల కోన్యాయం.. మీకో న్యాయమా.. దీనిని ఏ విధంగా చూడాలి? అంటూ గ్రేటర్ వాసులు ప్రశ్నిస్తున్నారు. మేయర్ విజయలక్ష్మి బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో జరిగిన బతుకమ్మ వేడుకలు వివాదాస్పదమయ్యాయి. నగరంలో డీజే బ్యాన్ ఉన్న నేపథ్యంలో అత్యధికంగా సౌండ్స్‌తో డీజే పెట్టిన చోట మేయర్ పాల్గొనడమే కాకుండా పోలీసులకు సవాల్ విసరడం కూడా చర్చకు దారి తీసింది. ఈ వేదికపై నుంచి విజయలక్ష్మి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటుంటే కొందరు ఓర్వలేక పోలీసులను మనపైకి పిలుస్తున్నారు. ఈ అక్క ఉన్నంతవరకు ఎవరూ ఏమీ చేయలేరు. ఇవాల ఈ అక్క తల్వార్ ఎత్తింది. రేపు మీరంతా తల్వార్ ఎత్తాలి అనడం సంచలనంగా మారింది. ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతుంది. దీనిపై నెటిజన్లు ఒకవైపు మండిపడుతుంటే గ్రేటర్ వాసులు సైతం మేయర్ తీరును ఎండగడుతున్నారు. బతుకమ్మ వేడుకలో నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ పెద్ద ఎత్తున మోగుతుంటే కొందరు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడకు వచ్చిన పోలీసులకు మేయర్ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చి వెనక్కు పంపించేశారని తెలిసింది. ఈ సమయంలో స్టేజ్‌పై నుంచి మేయర్ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లో డీజేను నిషేధిస్తూ సీపీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత సమయాల్లో నిబంధనలను అనుసరించి ముందస్తు పర్మిషన్‌తో కొంత డెసిబుల్స్ వరకు మాత్రమే డీజేను అనుమతిస్తున్న నేపథ్యంలో ఎన్‌బీటీ నగర్ బతుకమ్మ వేడుకలో అధిక సౌండ్స్‌తో పెట్టిన డీజే వివాదాస్పదమైంది. ఇదిలా ఉంటే.., ఇదే వేదికపై మేయర్ కత్తి ఎత్తి చూపుతూ అందరినీ రెచ్చగొట్టేలా ప్రసంగం చేస్తూ, అందరూ కత్తి పట్టాలని పిలుపునివ్వడం సంచలనంగా మారింది. అసలు డీజే బ్యాన్ అమలుపై పోలీసులకు స్వయంగా నగర మేయర్ ఈ అక్క ఉండగా.. ఏం చేస్తారు? అంటూ... సవాల్ విసిరారు.

మార్కెట్‌లో కొత్త ఉపాధి మార్గాలు

డాగ్ హెయిర్ డ్రెస్సెస్‌గా మారుతున్న బార్బర్లు

ఉపాధి మార్గంగా డాగ్ బ్రీడ్స్

హైదరాబాద్, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): మారుతున్న లైఫ్‌స్టైల్‌కి అనుగుణంగా కొత్త ఉపాధి మార్గాలు లభిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో పెట్ లవర్స్ పెరిగిపోతున్నారు. కుక్కలను పెంచుకోవడం ఫ్యాషన్‌గా మారింది. కేవలం పెంపకం వరకే కాదు.., మనుషుల కంటే ఎక్కువ ఖర్చు పెట్టి వాటిని పోషిస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న డాగ్ బ్రీడ్స్ కూడా మార్కెట్లో విపరీతంగా అమ్ముడుపోతున్నాయి. అయితే, ఈ విదేశీ బ్రీడ్స్ పెంచుకోవడం ఖరీదైన అంశంగా మారింది. దీంతో వీటినే కొంతమంది తమ ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. మామూలు హెయిర్ కటింగ్ సెలూన్‌లో పనిచేసే బార్బర్లు.. మెల్లిగా ఇప్పుడు డాగ్ హెయిర్ డ్రెస్సెస్‌గా మారుతున్నారు. మనుషులకు కటింగ్ చేస్తే కేవలం రూ.300 నుంచి రూ.500 వరకు లభిస్తాయి. అదే ఒక కుక్కకి హెయిర్ కట్ చేస్తే రూ. 2000 మినిమం వస్తుండటంతో ఆ ప్రొఫెషన్ వైపు అడుగులు వేస్తున్నారు. చిన్నపాటి ట్రైనింగ్‌తోనే బార్బర్లు డాగ్ హెయిర్ డ్రెస్సర్‌గా మారే అవకాశం ఉంది. దీనికి తోడు హైదరాబాద్ లాంటి నగరంలో ప్రతి గల్లీకి ఒక పెట్ క్లినిక్, పెట్ గ్రూమింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైతే ఇంటికే వచ్చి డాగ్‌బాత్, హెయిర్ డ్రెస్సింగ్ లాంటి డోర్ స్టెప్ ఫెసిలిటీస్ కూడా అందుబాటులో ఉన్నాయి. తమ పెంపుడు కుక్కలకు రకరకాల హెయిర్ స్టైల్స్ చేయిస్తున్నారు. ఒక్కో హెయిర్ స్టైల్‌కి ఒక్కోరకంగా చార్జ్ చేస్తూ డాగ్ హెయిర్ డ్రెస్సెస్ కూడా నెలకు లక్షల్లోనే సంపాదిస్తున్నారు. వీటికి తోడు కుక్కలకు నెయిల్స్ కటింగ్, మసాజ్, షాంపూ క్లీనింగ్ లాంటి సేవలందిస్తూ అదనంగా సంపాదిస్తున్నారు. అయితే, ఈ ఫారిన్ బ్రీడ్స్ పెంచుకోవడం ఖరీదైన అంశం. వీటినే కొంతమంది తమ ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. మామూలు హెయిర్ కటింగ్ సెలూన్‌లో పని చేసే బార్బర్లు మెల్లిగా ఇప్పుడు డాగ్ హెయిర్ డ్రెస్సెస్‌గా మారుతున్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించిన ప్రపంచ గుడ్ల దినోత్సవంలో ఉదయ్ సింగ్ బయాస్, బాలస్వామి, రామకృష్ణ, లక్ష్మణ్ పూడి, బాలాజీ, రాధాకృష్ణ తదితరులు

గుడ్లు తినండి.. ఆరోగ్యంగా ఉండండి

ఉదయ్ సింగ్ బయాస్

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11: కోడి గుడ్డు అన్ని వయస్సుల వారికి మంచి పౌష్టిక ఆహారం అని, రోజు గుడ్లు తిని... ఆరోగ్యంగా జీవించాలని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, సీబీసీఐడీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ గుడ్ల దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్ సింగ్ బయాస్, నెక్ సలహాదారుడు బాలస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆరోగ్యడైట్ ఫౌండర్ లక్ష్మణ్‌పూడి, ఫిల్మ్ డైరెక్టర్ బాలాజీ, మ్యూజిక్ డైరెక్టర్ రాధాకృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తల్లిపాల తర్వాత గుడ్డులో మాత్రమే అనేక పోషకాలు ఉన్నాయని, కరోనా లాంటి అనేక రోగాల నుంచి బయటపడటానికి గుడ్డు ఎంతో మేలు చేస్తుందన్నారు. చిన్నారులు, గర్భిణులతో పాటు అందరు గుడ్డు తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గుడ్డులో మిటమిన్ డి, మిటమిన్ బి12 వంటి పోషకాలు మెండుగా ఉన్నాయని, రోజు తినే ఆహారంలో గుడ్డు తప్పకుండా ఉండాలన్నారు. అలాగే, నవంబర్ 26 నుంచి 29 వరకు జరిగే అంతర్జాతీయ కోళ్ల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో సారీస్ ఆఫ్ ఇండియా, దసరా, బతుకమ్మ ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరుకు చెందిన ఐక్యం డాన్స్ కంపెనీ కళాకారులు గణేశా పంచరత్న, కంజదళయాదాక్షి, దేవి స్తుతి, ఓంకార రూపిణి, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకోగా, శంకరానంద కళాక్షేత్ర నిర్వహకులు పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ శిష్య బృందం నలభై మంది కళాకారులు 'శ్రీ' నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

- కొండాపూర్, అక్టోబర్ 11

నెక్లెస్ రోడ్‌లో ప్రపంచ ఆర్థ్రైటీస్ డే వాక్

ప్రారంభించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, అక్టోబర్ 11: ప్రపంచ ఆర్థ్రైటీస్ డే సందర్భంగా ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని జల విహార్ వద్ద అవగాహన వాక్ ఏర్పాటు చేశారు. ఈ వాక్‌ను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్, రుమటాలజీ విభాగాధిపతి డాక్టర్ లీజా రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ, జన్యుపరమైన లోపాల వల్ల చిరు ప్రాయంలోనే రుమటైడ్ ఆర్థ్రైటీస్ బారిన పడుతున్నారని, వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దేశ వ్యాప్తంగా రుమటాలజీ వైద్యులు తక్కువ సంఖ్యలో ఉన్నారని, రోగులకు అందించే వైద్యం సైతం ఖరీదైనదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ముందుకు వచ్చి వ్యాధిగ్రస్తులకు అండగా నిలబడాలన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తి స్థాయి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. రుమటాలజీ అసోసియేషన్లు ఈ వ్యాధిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ (ఎలెక్ట్) డాక్టర్ నర్సింహులు, అధ్యక్షులు డాక్టర్ వర ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ విజయ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి క్రికెట్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు

రాచకొండ సీపీ సుధీర్ బాబు

సిటీబ్యూరో, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): నేడు ఉప్పల్‌లో భారత్, బంగ్లాదేశ్ మధ్య జరిగే టీ-20 క్రికెట్ మ్యాచ్‌కు 2600 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. స్టేడియంలో 39 వేల మందికి సీటింగ్ సామర్థ్యం ఉందని, ప్రశాంత వాతావరణంలో క్రికెట్ మ్యాచ్ జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. బందోస్తులో 250 సెక్యూరిటీ వింగ్, 400 ట్రాఫిక్, 1662 లా అండ్ ఆర్డర్, టీఎస్ఎస్‌పీ 14 ప్లాటూన్స్, ఆర్మ్డ్ ఫోర్స్ 6 ప్లాటూన్స్, అక్టోపర్ 2 టీమ్‌లు, మౌంటెడ్ పోలీస్ 10, వజ్రా 10లతో పాటు ఎస్‌బీ, సీసీఎస్, ఎస్ఓటీ అన్ని విభాగాల సిబ్బంది విధి నిర్వహణలో ఉంటారని సీపీ వివరించారు. స్టేడియం చుట్టూ 300 సీసీ కెమెరాలతో బందోబస్తును పర్యవేక్షిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు ల్యాప్‌టాప్, బ్యానర్స్, వాటర్ బాటల్స్, కెమెరా, సిగరెట్ ఎలక్ట్రానికి ఐటమ్స్, అగ్గిపెట్టే, లైటర్, షార్ప్ మెటిరియల్స్, బైనోక్లర్స్, కాయిన్స్, రైటింగ్ పెన్స్, బాటరీస్, హెల్మెట్స్, ఫర్‌ఫ్యూమ్స్, బ్యాగ్స్, బయట నుంచి ఆహార పదార్థాలు లోపలికి తేవద్దని సీపీ సూచించారు.